సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

60 మందికి వైద్య సేవలు



శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: కాస్మిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి వైద్య శిబిరాన్ని జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ నాడి పరీక్షించి ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి ద్వారా షుగర్, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, స్త్రీల సమస్యలు నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ శ్రవంతి, హెచ్‌ఆర్‌లు కె.శ్రీధర్, అన్నపూర్ణ, హరిణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదువంటే మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అందులోని నీతిని బోధించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



తులాభారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

పెదగంట్యాడ: వుడా కాలనీలోని పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి వారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తులాభారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పరస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు



శ్రీలలితా మహా త్రిపుర సుందరిగా రాజశ్యామల

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి శ్రీరాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. నవరాత్రులు చివరి రోజున అమ్మవారు రాజశ్యామలగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజశ్యామల అమ్మవారిని దర్శనం చేసుకునే భక్తులకు సమస్త భోగభాగ్యాలు,సద్విద్య అవగతమవుతాయని నమ్మకం.రాజ్యాధికారం,పదవీ కాంక్షితులకు అమ్మవారి దర్శన భాగ్యం ద్వారా కటాక్షం కలుగుతుందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. అమ్మవారి సన్నిధిలో సహస్ర నామావళి అర్చన, రాజశ్యామల హోమం నిర్వహించారు. సాయింత్రం హరికాదేవి శ్యామా అమ్మవారి చరిత్రను తెలుపుతూ హరికథా కథనం గావించారు. సాయంత్రం శ్యామా సిరిజ్యోతి పూజ చేశారు. అమెరికా,రష్యా దేశాల నుంచి వచ్చిన సాధకులు నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ భక్తులందరినీ ఆశీర్వదించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606
సాక్షి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



నడుపూరులో ఉరుకూటి చందుకు హారతి ఇస్తున్న స్థానిక మహిళలు



జీవీఎంసీ 87వ వార్డు దుగ్గపువానిపాలెంలో పాదయాత్రలో స్థానికులకు అభివాదం చేస్తున్న ఉరుకూటి రామచంద్రరావు

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు

పెదగంట్యాడ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) పిలుపునిచ్చారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరులో గల పైడిమాంబ ఆలయం నుంచి ఆదివారం ఉదయం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి పూజలు చేసి ప్రారంభించిన యాత్రకు విశేష స్పందన లభించింది. మహిళలు అడుగడుగునా మంగళహారతులు పట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో నాయకులు మంత్రి రాజశేఖర్, ఉరుకూటి అప్పారావు, కొండయ్య, చిన్నారావు, బాబూరావు, మురళి, మంత్రి మంజుల, ఆదిలక్ష్మి, రేవతి, గొంప రమేష్, ములకలపల్లి ప్రసాద్, శరత్‌కుమార్, నరసింగరావు, పీత గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరకలెత్తే ఉత్సాహంతో పాదయాత్ర

కూర్మన్నపాలెం: అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి సంక్షేమ పథకాలతో మా బతుకుల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే మా ఓటు అని ప్రజలు భరోసా ఇవ్వడంతో ఉరకలెత్తే ఉత్సాహంతో గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు పాదయాత్రలో దూసుకుపోతున్నారు. జీవీఎంసీ 87వ వార్డు దుగ్గపువానిపాలెంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాదయాత్రలో భాగంగా గడపగడపకూ చందు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి, అసమర్థ పాలనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నవరత్నాలతో కూడిన సంక్షేమ పథకాలను, సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, మార్పు శేషు, శ్రీనివాసరావు, కాండ్రేగుల అప్పలనాయుడు, బొడ్డేటి మోదినాయుడు, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, బొండా గోవిందరాజులు, కోనేటి పారిపల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పానికి కేంద్రం తలవంచక తప్పదు



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ దీక్షలో పాల్గొని నినాదాలు చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం పోరాటాల పురిటి గడ్డ విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న 1102వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకొచ్చినా అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు



సీఎండీ అతుల్ భట్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉద్యోగి జయరాజు



అవార్డు అందుకుంటున్న వైద్యురాలు సుజాత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 105 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను ప్రధానం చేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో నెహ్రూ అవార్డులు అందజేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఉక్కునగరం ఎంపీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా 56 మంది అధికారులు, 49 మంది కార్మికులు అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డీకే మొహంతి, బాగ్చీ, ఎస్.సి.పాండేతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట నేడు

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారి కూడలిలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి వాహన (ఒంటె) విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం పదిన్నర గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రాప్తాడు సభతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు

అగనంపూడి: రాప్తాడు సిద్ధం సభ విజయవంతం కావడంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. అగనంపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. కేవలం వైఎస్సార్సీపీ శ్రేణులు హాజరైతేనే రాప్తాడు సభ విజయవంతమైందని... అదే పథకాల లబ్ధిదారులు, అభిమానులు హాజరైతే పరిస్థితి ఎలా వుంటుందో ప్రతిపక్షాలు ఊహించుకోవాలన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పథకాలు అమలు చేస్తుండడం వల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభలు విజయవంతం అవుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు యలమంచిలి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పతక విజేతకు సత్కారం



అండిబోయిన అప్పారావును సత్కరిస్తున్న మిత్రులు

పెదగంట్యాడ: సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 13 వరకూ గోవా జీఎంసీలోని బొలియన్ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన అండిబోయిన అప్పారావును ఆదివారం ఘనంగా సత్కరించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనతోపాటు చదువుకున్న వారు, ఆయనకు హిందీ బోధించిన ఉపాధ్యాయుడు రాజు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి తదితరులు అప్పారావును దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అప్పారావు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్లెల సూర్యనారాయణ, చీకటి శ్రీనివాస్, సత్యం, పూతి పోలరెడ్డి, ముత్యాలరావు, కాకినాడ సత్యనారాయణ, ఎస్ఆర్ మూర్తి, కిలాని రమణ, బొడ్డు నూకరాజు, వరహాలరావు, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామి ఆలయంలో పారాయణ



రాజులపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి 50 మంది బృంద ప్రతినిధులు లంకెలపాలెం సమీపంలోని రాజులపాలెం సూర్యనారాయణ స్వామి దేవాలయంలో పారాయణ చేశారు. సేవా సమితీ అధ్యక్షురాలు చిత్తా జానకీదేవి ఆధ్వర్యంలో మహిళా బృందం మాఘమాసాన్ని పురస్కరించుకుని లలిత, విష్ణు సహస్ర నామ, సూర్యాష్టక పారాయణ చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి బృంద ప్రతినిధులు లలిత, పద్మ, మహాలక్ష్మి, శోభారాణి, చిత్తా రామారావు, కాసులమ్మ, బొరమ్మ, తదితరులు సారథ్యం వహించారు.

నైతిక విలువలతో విద్య బోధించాలి



ఉరుకూటి చందును సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

అగనంపూడి: విద్యా బోధనలో నైతిక విలువలు జోడించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు) అన్నారు. 85వ వార్డు దిబ్బపాలెంలోని స్టార్‌డ్రమ్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. అనంతరం చందును సత్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ వైస్ ప్రిన్సిపాల్ బొడ్డు రవి, జిల్లా ఉప విద్యా శాఖాధికారి ఎ.గౌరీశంకర్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రంగారావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి సంజీవరెడ్డి కృషి

పెదగంట్యాడ: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా డాక్టర్ జి.సంజీవరెడ్డి పనిచేస్తున్నారని ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను నడుపూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, డి.మోహన్, గంట్యాడ గురుమూర్తి, నెల్లి అప్పలరాజు, గొందేశి ప్రభాకర్ రెడ్డి, పీవీ నగేష్, మంత్రి శంకరనారాయణ, మంత్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

అక్కిరెడ్డిపాలెం: అఖిల భారత ఇంటక్ అధ్యక్షుడు, భెల్ జేఏసీ, సీడబ్ల్యూసీ మెంబర్ జి.సంజీవ రెడ్డి జన్మదిన వేడుకలు భెల్ (హెచ్‌పీవీపీ)లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు కేక్ కట్ చేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఉద్యోగులు పీవీ అప్పారావు, కె.శ్రీనివాసరావు, వి.అప్పారావు, వి.ఆనందరావు, సీతంనాయుడు, ఆనంద్ కుమార్, సిహెచ్.మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ సమ్మేళనం విజయవంతానికి పిలుపు



బౌద్ధ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: ఈ నెల 25న ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ నగరంలోని రామాటాకీస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో నిర్వహించనున్న 11వ బౌద్ధ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన బౌద్ధ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ భిక్షువులు తరలి రానున్నారని, ఈ సందర్భంగా బౌద్ధ దమ్మ జ్యోతి ర్యాలీ, దమ్మ దీక్ష, దమ్మ మహాసభ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, జిల్లా జాయింట్ సెక్రటరీ పెయ్యల సిద్ధార్థ తెలిపారు. కార్యక్రమంలో గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం



డాక్టర్ వామదేవ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత్'అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఏఎం వేదికగా నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. అయితే చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రాచీన చరిత్ర మూలాలను, నాగరికతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు ప్రపంచానికి అందించాలన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ భారత చరిత్రకారులు రాసిన మనదేశ చరిత్ర కొంత మేర వెలుగులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో శివానంద సుపథ ఫౌండేషన్ ద్వారా ప్రాచీన భారత చరిత్రను నేటితరానికి వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నేటి చరిత్రకారులు రాసిన పుస్తకాలను ప్రచురించడం, సదస్సుల ద్వారా చారిత్రక ఆధారాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆచార్య సుదర్శనరావు, ఆచార్య ఆర్.రాఘవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. పండిట్ వామదేవ శాస్త్రిని నిర్వాహకులు సత్కరించారు.

చదవని పుస్తకాలను డొనేట్ చేయండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉండ్రాజవరం గ్రంథపాలకుడు నున్న వెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనికి కారణం ఫిజికల్ బుక్స్‌కు ప్రత్యామ్నాయంగా డిజిటల్, ఎల్రక్టానిక్ బుక్స్ వచ్చాయని చెప్పారు. చేతిలో మొబైల్ ఉంటే గూగుల్ చేస్తే అన్ని పుస్తకాలు మన వద్ద ఉన్నాయన్న భావన పాఠకులు, విద్యార్థుల్లో కనిపిస్తోందన్నారు. పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంత భాగాన్ని సీఎస్ఆర్ కింద పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ఇచ్చేలా సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ కృషి చేసిందని కొనియాడారు. విశాఖ పౌర గ్రంథాలయం అభివృద్ధే దీనికి నిదర్శనమన్నారు. చాలా మంది వద్ద పుస్తకాలు చదవకుండా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఇచ్చేలా బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెలగా పోత్తమరావు, ఎం.కోటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ వెంకటరావు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ మొయిన్ గేటు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అట్లగూన గ్రామం అరకుకు చెందిన పంగి గోపినాథ్ అనే యువకుడు అరకు నుంచి బెంగుళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ భరత్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్


సీతమ్మధార: ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఐదుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో గల ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ పేకాటాడుతున్న కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన కడగల రామకృష్ణ, గాజువాక కర్ణవానిపాలేనికి చెందిన ఎస్.భీమరాజు, తాటిచెట్లపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వెనుక వీధికి చెందిన వేకి శ్రీనివాసరావు, కంచరపాలెం గజపతినగర్‌కు చెందిన బోరులపల్లి శ్రీనివాసరావు, దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన రఘుమండ మోహన్‌రావులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.34,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

మహారాజా బ్యాంక్
రిజిస్ట్రేషన్ నెం. AMC/VSP/DCO/2004/758 - RBI Licence No.: UBD HYD AP 24P
కూర్మన్నపాలెం శాఖ ప్రారంభోత్సవము
తేది: 19 ఫిబ్రవరి 2024, సోమవారం
ఉదయం గం. 10.33 ని.లకు
డోర్ నెం. 31-42-2/1, హెచ్.ఐ.జి-28, ఆర్.కె. కామర్స్ స్క్వేర్,
ఫేజ్-1 లే అవుట్, వుడా నగర్, కూర్మన్నపాలెం, విశాఖపట్నం-530046.
ఫోన్: 0891-4425735. సెల్: 9281438445, 46
ప్రారంభకులు

ముఖ్య అతిథి

H.O: 47-9-16,3వ లైను,ద్వారకానగర్,విశాఖపట్నం-16.ఫోన్:2505888, 2721733

గాజువాక	బుచ్చిరాజుపాలెం	మధురవాడ	యమ్.వి.పి.	సుజాతనగర్	కాకినాడ
7799774923	7799774925	7799774930	7799774927	9281105142	9281105145